క్లుప్తంగా

రాఘవేంద్రస్వామి బృందావన వార్షికోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని రాఘవేంద్రస్వామి బృందావనంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు సమితి కోశాధికారి వై.వెంకటేష్ బుధవారం విలేకర్లకు తెలిపారు . మార్చి ఒకటో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఈ వేడుకలు జరుగుతాయన్నారు. రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని ప్రతిష్ఠించి 46 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మార్చి 1న నాగ దోష నివారణార్థం ఉదయం 7 గంటల నుంచి ఆశ్లేష బలి సేవ జరుగుతుందని తెలిపారు. రెండో తేదీ నాలుగో తారీఖు వరకు బ్రహ్మ కలశాభిషేక రథోత్సవ సహిత సర్వసేవ, కలశాభిషేక సహిత రంగ పూజ, కనకాభిషేక సేవ, పంచామృతాభిషేకాలు, కలశాభిషేకాలు, గురువుల పాదపూజ, అష్టోతర విశేష తులాభార సేవ జరుగుతాయన్నారు. నాలుగో తారీకు సాయంత్రం నాలుగు గంటల నుంచి రాఘవేంద్ర స్వామి ఉత్సవ విగ్రహంతో నగర ప్రధాన వీధులలో రథోత్సవం జరుగుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప: మండలం వేళంగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల వల్ల గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఈఈ జి.ప్రసాద్ తెలిపారు. వేళంగిలో బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులతో పాటు, బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చడం, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సవరించడం జరుగుతుందన్నారు. వేళంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేళంగి, సిరిపురం, కూరాడ, చినమామిడాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు.

రేపు నగర పరిధిలో..

కాకినాడ సిటీ: స్థానిక డి1 సెక్షన్ పరిధిలోని ఫీడర్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. డీ1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ ఆనంద భారతి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సినిమా రోడ్డు, పోలీసు లైన్ వీధి, బ్యాంకు పేట, గుజ్జువారి వీధి, చిన వీధి, రాజాక్ అపార్టుమెంట్ తదితర ప్రాంతాలకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఈఈ ప్రసాద్ కోరారు.

నేతలకు ఘనంగా నివాళి

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం నాయకులు పలువురు నాయకుల వర్ధంతులను ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఇనుగంటి నారాయణరావు, కామ్రేడ్స్ జీఎస్ బాలాజీదాస్, గుండాపు చిట్టియ్య, బీబీ నాయుడు సీపీఎంలో ఉద్యమ నాయకులుగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కె.వీరబాబు, ఎం.రాజశేఖర్, దువ్వా శేషుబాబ్జీ తదితరులు వారికి నివాళులర్పించారు.

లక్ష పసుపు కొమ్ముల నోము



లక్ష పసుపు కొమ్ముల నోము నిర్వహిస్తున్న పండితులు

పిఠాపురం: గొల్లప్రోలులో ఉన్న అచ్చుతకృష్ణ కల్యాణ మండపంలో బుధవారం వ్యాపారి గొల్లపూడి శ్రీరామ చంద్రమూర్తి, జయలక్ష్మి దంపతులు గరిసె ధాన్యం, లక్ష పసుపు కొమ్ముల నోమును నిర్వహించారు. కొల్లూరి పవన్‌శర్మ పూజా కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం ముత్తయిదువులకు పసుపు కొమ్ములను పంపిణీ చేశారు.

2025 డిసెంబర్‌కు ఇళ్లన్నీ పూర్తి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ
- లబ్ధిదారులతో కొమరగిరి లే అవుట్ సందర్శన



ఇళ్ల స్థలాల విషయమై మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. హాజరైన లబ్ధిదారులు

కాకినాడ: రానున్న ఎన్నికల్లో మరోసారి గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2025 డిసెంబర్ నాటికల్లా పట్టాలిచ్చిన ప్రతి ఒక్కరికి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి స్వగృహ ప్రవేశం చేయించాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక 25, 26, 27 డివిజన్లకు చెందిన సుమారు రెండువేల మంది లబ్ధిదారులను బస్సుల్లో కొమరగిరి లే అవుట్‌కు తీసుకువెళ్లి అక్కడ జరుగుతున్న గృహ నిర్మాణ ప్రగతిని వివరించారు. ఒక్క కొమరగిరిలో దాదాపు పదివేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థలాలు ఇచ్చిన లబ్ధిదారులకు కూడా ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామని చెప్పారు. ప్రభుత్వ వాటాలుగా సమకూరుతున్న రూ.1.8 లక్షలకు తోడు, ఆర్థిక సంస్థల తోడ్పాటుతో ఇళ్లన్ని పూర్తి చేయాలన్నదే సంకల్పమన్నారు. 2019లో పదివేల మందికి ఇళ్ల స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చి, 30 వేల మందికి స్థలాలు ఇవ్వగలిగామంటే అదంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వల్లే సాధ్యమైందన్నారు. అర్హులు ఎంత మంది ఉన్నా స్థలాలు ఇస్తానని ప్రోత్సహించడం వల్లే ఇవ్వగలిగామన్నారు. దురదృష్టవశాత్తు ఇక్కడి టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తన రాజకీయ ప్రయోజనాల కోసం నగర పరిధిలోని స్థలాన్ని కేటాయించే సమయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుపడడం వల్ల కొమరగిరిలో స్థలాలు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేయక పోగా, అన్యాయం చేశారని, అటువంటి వ్యక్తులను రానున్న ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగర పాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన లబ్ధిదారులు అందరికీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి భోజన వసతి కల్పించారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

కొమరగిరి లే అవుట్‌లో రూ.8.5 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి బుధవారం ప్రారంభించారు. సుమారు 2 వేల లీటర్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటైంది. అక్కడి లే అవుట్‌లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజల మంచినీటి అవసరాలను తాత్కాలికంగా తీర్చేందుకు వంగా గీత ఎంపీ నిధులతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ లే అవుట్ పరిధిలో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని స్పష్టం చేశారు. గృహనిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, డీఈ సత్యనారాయణరెడ్డి, ఏఈ సోమిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

భక్తిశ్రద్ధలతో సంకష్ట గణపతి మాసోత్సవాలు



భోగి గణపతి నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: మాఘమాస సంకష్టహర గణపతి చతుర్థిని బుధవారం స్థానిక సూర్యారావుపేటలోని భోగి గణపతిపీఠంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం మంగళవాయిద్యాలతో నగర సంకీర్తన చేశారు. విఘ్నేశ్వర ప్రతిమతో సిద్ధి, బుద్ధి కలశ ప్రతిష్ఠ, పాలవెల్లితో పుష్పార్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం సహస్ర నామ పారాయణ, లక్ష వత్తులతో అఖండ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ 2026 మాఘమాసం వరకూ రెండేళ్ల పాటు చతుర్థి మాసోత్సవాలు పీఠంలో ప్రతి నెలా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు

- తిమ్మాపురం, పండూరు గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి
- పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల, కాకినాడ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సునీల్



తిమ్మాపురంలో వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం, పండూరు గ్రామాలలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తిమ్మాపురంలో ప్రాచీనమైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మించడంతో బుధవారం దేవదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరిగాయి. సీజీఎఫ్ గ్రాంట్ రూ.45 లక్షలు, మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ రూ.5 లక్షలు కలిపి రూ.50 లక్షలు, భక్తులు, గ్రామస్తులు సేకరించి విరాళాలు కలిపి సుమారు రూ.1.20 కోట్లతో నిర్మించిన విష్ణు ఆలయాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటరు చలమలశెట్టి సునీల్, రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, దేవదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం స్వీకరించారు. పండూరు గ్రామంలో గౌరీ సమేత ఉమా కేదారేశ్వర స్వామి ఆలయం (శివాలయం) ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు, సునీల్ పాల్గొన్నారు. కేదారేశ్వరస్వామిని దర్శించుకుని, శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో 125కు పైగా ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణం చేపట్టామన్నారు. ఆ భగవంతుడు ఆశీస్సులు సీఎం జగన్, తనపై, పార్లమెంట్ కో ఆర్డినేటరు సునీల్‌పై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. శివాలయం నిర్మాణానికి సునీల్ సొంత నిధులు రూ.10 లక్షలు విరాళంగా అందించారన్నారు. చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ తిమ్మాపురం, పండూరు గ్రామాలలో ఆలయాలు చక్కగా నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, నందిపాటి ధర్మరాజు, ఆదినారాయణ, నండూరు రాంబాబు, బావిశెట్టి వెంకటేశ్వరరావు, నందిపాటి పల్లయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పండూరు శివాలయం శిఖర ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులతో కన్నబాబు, సునీల్

ఓటుహక్కును వినియోగించుకోవాలి

కరప: యువత ఓటరుగా నమోదుచేసుకోవాలని, ఓటర్లందరూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ అన్నారు. అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. పోటీచేసే అభ్యర్థులలో సమర్థులు, నిజమైన ప్రజాసేవ చేసేవారిని, పరిపాలనాదక్షులను, నిజాయతీపరులను, ప్రజల ఆస్తులను పరిరక్షించే వారిని సరిచూసుకుని ఎన్నుకోవాలని ఎంఈఓలు కృష్ణవేణి, సత్యనారాయణలు సూచించారు. ఈ సందర్భంగా ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం పి.వెంకటశివగిరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అడ్డాల రమేష్, సీఆర్పీ పి.రాజు, బి.సుజాత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అరట్లకట్టలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



రిజిస్ట్రేషన్ల తీరును పర్యవేక్షించి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటరావు

- కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక గైగోలుపాడు, కరణం గారి జంక్షన్, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాల్లోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ల తీరును పర్యవేక్షించి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిగిలి ఉన్న రిజిస్ట్రేషన్లు, అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించి ఆ రిజిస్ట్రేషన్లపై కూడా దృష్టి పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఒకటి రెండు రోజుల్లో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక త్వరలోనే లబ్ధిదారులకు సంబంధిత పత్రాలు అందజేస్తామన్నారు. ఆయన వెంట ఆయా సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఏడీసీ పర్యవేక్షణ

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు బుధవారం పర్యవేక్షించారు. వైద్య నగర్, కృష్ణనగర్, బీసీ కాలనీ ప్రాంతాల్లోని సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేలా అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

రాష్ట్రానికి చమురు వాటా దక్కాలి

కాకినాడ సిటీ: కృష్ణా, గోదావరి బేసిన్‌లో చమురు గ్యాస్ 12వ ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు 50 శాతం వాటా రాష్ట్రానికి దక్కాలని, కాకినాడకు 10 శాతం ఇవ్వాలని కోరుతూ పోరాటం నిర్వహిస్తామని అఖిలపక్ష ప్రజా సంఘాల మేధావులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీభవన్‌లో కేజీ బేసిన్ గ్యాస్ చమురు వాటా ఏపీకి దక్కాలని కోరుతూ సీపీఐ-కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ చైర్మన్ తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ, పౌర సంక్షేమ సంఘం, మేధావుల సంఘం, వివిధ ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. సమావేశంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ నాలుగు జిల్లాలో గ్యాస్ చమురు వ్యాపించి ఉందని, ఇది ఉపరితల పరంగా చూస్తే 28 వేల చదరపు కిలోమీటర్లను సముద్ర గర్భంలో 24 కిలోమీటర్ల పరిధిలో ఉందన్నారు. సహజ వనరులు ఎక్కడైతే ఉంటాయో అక్కడ ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని డేగ ప్రభాకర్ అన్నారు. ఆనాడు గ్యాస్ వాటా కోసం వైఎస్ రాజశేఖరరెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేశారని, పలు ఉత్తరాలు ఢిల్లీకి రాశారన్నారు. దీనిపై సీపీఐ రాష్ట్ర కమిటీ భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తుందని వివరించారు. ఈ సమావేశంలో న్యాయవాది జవహర్ అలీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మట్ట శివప్రసాద్ తదితరులు మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న డేగా ప్రభాకర్



వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

ఓటరు దరఖాస్తుల పరిష్కారానికి కృషి

ఈఆర్వో రామారావు

పెద్దాపురం: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో బుధవారం ఎన్నికల ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై మరింత అవగాహన అవసరమన్నారు. ఇప్పటికి ఫారం 6కు సంబంధించి 155, 7కు సంబంధించి 45, 8కు సంబంధించి 101 దరఖాస్తులు అందాయన్నారు. ఆయా క్లయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆర్డీఓ అన్నారు. అనంతరం ఓటర్ల జాబితా విధానం, ఎన్నికల ప్రక్రియ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు,(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ) నీలపాల సూరిబాబు (సీపీఎం)లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఉపకరించే పనులు రూపొందించాలి

డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి

తాళ్లరేవు: ఉపాధి హామీలో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఉపయోగపడే పనులు రూపొందించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీని ఆమె సమీక్షించారు. ఎన్నికల నేపథ్యంలో జూన్ నెల వరకూ అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. రైతులకు ఉపకరించే నీటి కుంతలు, కొబ్బరి చెట్ల చుట్టూ బాదులు తీయడం, చెరువు గట్ల మధ్య కొబ్బరి మొక్కల పెంపకం వంటి పనులు రూపొందించాలన్నారు. 5 వేల మొక్కలు పెంచే రైతులకు రూ.30 వేలు ఉపాధి హామీ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. మండల కార్యాలయంలో నర్సరీ అభివృద్ధి చేయాలని కోరారు. సామాజిక తనిఖీలో రూ.10 వేలు రికవరీ చేసినట్లు తెలిపారు. పనులకు సంబంధించి ఫైలింగ్, రికార్డుల నిర్వహణ బాగుందని అధికారులను అభినందించారు. కార్యక్రమంలో ఏపీడీ వసంత మాధవి, ఏపీవో అన్నపూర్ణ, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

భళా బాల మేధావీ..

- ఘనంగా సైన్స్ దినోత్సవం
- హైస్కూళ్లలో ప్రాజెక్టుల ఆవిష్కరణ



గురజనాపల్లి హైస్కూలులో చంద్రయాన్ ఉపగ్రహం నమూనా



పెద్దాపురప్పాడు హైస్కూలులో సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన



గురజనాపల్లి హైస్కూలులో సైన్స్ ప్రాజెక్టులు తిలకిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు



అరట్లకట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి తయారు చేసిన రోబో గురించి తెలుసుకుంటున్న ఎంఈఓలు

కరప: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరట్లకట్టలోని ప్రాథమిక పాఠశాలలో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను ఆకళింపు చేసుకుని శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. కరప, గురజనాపల్లి, పెద్దాపురప్పాడు, అరట్లకట్ట, నడకుదురు, కూరాడ, వేళంగి తదితర గ్రామాల్లోని హైస్కూళ్లల్లో ఏర్పాటుచేసిన ప్రాజెక్టులు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయుల నేతృత్వంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. గురజనాపల్లి హైస్కూలులో సైన్స్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాలుగో తరగతి విద్యార్థి పబ్బినీడి సాయిశివతేజ తయారుచేసిన చంద్రయాన్ ఉపగ్రహం నమూనాకు ప్రథమ బహుమతి, రంగవల్లులపోటీలో 8వ తరగతి విద్యార్థినులు కె.శ్రీలక్ష్మి, జె.శ్రీచరిత మానవ అవయవాల కూర్పుతో వేసిన ముగ్గుకు ప్రథమ బహుమతి లభించాయి. వివిధ హైస్కూళ్లలో సైన్స్‌పై వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎ.సాయిమోహన్, ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి, ఎస్ఎస్ శ్రీనివాస్, బి.స్వర్ణరాణి, బి.సుదర్శన్, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి అన్నారు. స్థానిక భవిత సెంటర్ విభిన్న ప్రతిభావంతులకు నెల్లూరు ఎన్ఐఎంహెచ్ ద్వారా మంజూరైన ఎంఆర్ కిట్లను బుధవారం ఆమె అందజేశారు. ఐఆర్‌టి ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివజ్యోతి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు విద్యాశాఖ ద్వారా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా విద్యార్థులకు మెరుగైన వైద్యం, విద్య సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
TATA SIGNA 4225 BS6 TANKER
2023 MODEL AP39 UM 3335
Cell : 97056 11339
13-1-33/2, Sri Sai Sannidhi Complex, 2nd Floor, OPP. Town Hall, Main Road, KAKINADA.

